'ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది'

విశాలాంధ్ర- వట్టి చెరుకూరు : విద్యార్థులకు విద్యాబుద్ధులను, క్రమశిక్షణను, నైతిక విలువలను నేర్పి, సమాజానికి ఉత్తమ పౌరులను అందించే అనిర్వచనీయమైన పాత్రను పోషిస్తూ, ఉత్తమ సమాజాన్ని నిర్మించే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎస్టీయూ గుంటూరు జిల్లా పూర్వ అధ్యక్షులు గేరా మోహనరావు అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని వింజనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంను ప్రధానోపాధ్యాయిని డి.కళ్యాణిజయలూక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త, తత్వవేత్త, భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.ఎలిజిబెత్ రాణి, డి.చంద్రిక, శివకుమారి, వీరయ్య, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-తాడికొండ : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ రాజమండ్రి సెంట్రల్ జైలులో జైలు శిక్ష అనుభవిస్తున్న చంద్రబాబును విడుదల చేయాలని కోరుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అడ్డరోడ్డు సెంటర్‌లో చేస్తున్న నిరాహార దీక్ష గురువారానికి 23వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడారు. ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్రబాబును జైలుకు పంపించారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదన్నారు. రానున్న రోజులలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరిం చారు. చంద్రబాబు బయటకు వచ్చేంతవరకు వివిధ రూపాలలో ఆందోళనలను కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలసిల ప్రసన్న, గుంటుపల్లి మధుసూదన్ రావు, నూతలపాటి రామారావు, ఎడ్డూరి వీరహనుమంతరావు, తాటి తులసిరామ్, నీలాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే...

విశాలాంధ్ర-తాడికొండ : అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. రావెల గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు. గ్రామస్తులకు బీపీ షుగర్ నరాలు చర్మ మొదలైన వ్యాధులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమణలకు గురౌతున్న బకింగ్ హోమ్ కెనాల్ కట్ట

విశాలాంధ్ర-తాడేపల్లి : బకిం గ్ హోమ్ కెనాల్ అమరారెడ్డి నగర్ కట్ట వెంబడి ఆక్రమణ లపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. భారీగా పాక షెడ్లు వేసిన పట్టించుకునే వారే లేరని విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో నోటీసులు ఇచ్చినా అక్రమణదారులు లెక్కచేయడం లేదు. అక్రమ కట్టడాలను అడ్డుకోటంలో ఎంటీఎంసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికుల నుంచి విమ ర్శలు వినిపిస్తున్నాయి. పేదవారికి కనీసం నివాస స్థలాలు లేక ఎక్కడైనా జాగా ఏర్పాటు చేసుకుంటే కనికరించకుండా కూల్చి వేసే పాలకులు ఇలాంటి ఆక్రమణలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

వేద సీడ్స్‌కు ఐఎస్ఓ సర్టిఫికెట్

విశాలాంధ్ర-గుంటూరు: క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (క్యూఎంఎస్-నాణ్యవంతమైన నిర్వహణ) విభాగంలో వేద సీడ్స్‌కు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ ద్వారా ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికేట్ లభించిందని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. నాణ్యమైన యాజమాన్య పద్ధతులతో అత్యుత్తమమైన మేలుజాతి విత్తనాలు అందిస్తున్న వేద సీడ్స్ ఈ సర్టిఫికేట్ పొందడం, రైతులు తమపై పెట్టుకున్న నమ్మకానికి ప్రతిరూపాలే ఈ ఐఎస్ఓ సర్టిఫికేట్, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ సీడ్ కంపెనీగా తమకు వచ్చిన అవార్డులని సంతోషంగా తెలియజేశారు.

జీ తెలుగులో రెండు సీరియల్స్ ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు : జీ తెలుగులో ఇదివరకెన్నడూ లేని విధంగా సరికొత్త కాన్సెప్ట్ టెలివిజన్ రంగంలో విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టబోతోంది. తెలుగు భాష, సంస్కృతి సంప్రదాయాలను బోధిస్తూనే కడుపుబ్బా నవ్వించేందుకు 'తెలుగు మీడియం ఐస్కూల్' అనే విభిన్నమైన నాన్ ఫిక్షన్ షోతో మీ ముందుకు రాబోతోంది. అంతేకాకుండా పుట్టుకతోనే కష్టాల పాలైన ఓ యువరాణి కథతో జాబిల్లి కోసం ఆకాశమల్లె అనే సరికొత్త సీరియల్‌ను కూడా అందిస్తోంది జీ తెలుగు. బాలీవుడ్ బ్యూటీ సన్నీ లియోన్ ముఖ్య అతిథిగా ప్రారంభం కానున్న తెలుగు మీడియం ఐస్కూల్ ఈ నెల 8 నుంచి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు, అదేవిధంగా జాబిల్లి కోసం ఆకాశమల్లె ఈ నెల 9 నుంచి సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటలకు జీ తెలుగులో పారంభం కానున్నాయి.

రేపు నగరంలో 'ధర్మాగ్రహ' ర్యాలీ

జయప్రదానికి సీపీఐ, టీడీపీ పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా గుంటూరు నగరంలో ఈ నెల 7వ తేదిన 'ధర్మాగ్రహ' ర్యాలీ నిర్వహించతలపెట్టి నట్లు సీపీఐ, టీడీపీ, ప్రజాసంఘాల ముఖ్య నాయకుల సమావేశం తెలియజేసింది. శని వారం మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు లాడ్జిసెంటర్‌లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి హిమనీ సెంటర్‌లో ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం వరకు శాంతియుతంగా ర్యాలీ జరుగనుందని సమావేశం తెలియజేసింది. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన గురువారం జరిగిన ఈ సమావేశంలో ధర్మాగ్రహ ర్యాలీ జయప్రదానికి తీసుకోవాల్సిన చర్యలపై సీపీఐ, టీడీపీ ముఖ్యనేతలు చర్చించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజలు, రాజ కీయ పార్టీలు, హక్కుల కోసం ఉద్యమించే ప్రజా సంఘా లు, కార్మిక సంఘాలపై మునుపెన్నడూ లేనివిధంగా నిర్బంధాలను కొనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్డగోలుగా... రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించి చంద్రబాబును అరెస్టు చేయ డమే దీనికి పరాకాష్ట అని అన్నారు. ఈ నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న సీపీఐ చంద్రబాబు అరెస్టు తీరును సైతం ఆది నుంచి ఖండిస్తుందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఈ నిర్బంధాలకు వత్తాసు పలుకు తున్న కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ముఖ్య మంత్రి అప్పులు చేస్తుంటే కళ్ళు మూసుకుని చూస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించు కోవడం కోసం... రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడం కోసం ధర్మాగ్రహ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ర్యాలీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ కళ్ళు తెరిపించాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీకి రాజకీయాలకు అతీతంగా ఆయా పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు, సంఘాలు మద్దతునివ్వాలని కోరారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి అడ్డగోలు పరిపాలన చేస్తున్నారని మండిపడ్డారు. కనీసం రోడ్లపైకి వచ్చి నిరసనలు, ర్యాలీలు తెలియజేసే హక్కును కూడా హరిస్తున్నారని అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రాష్ట్రంలోనే కాకుండా దేశవిదేశాలలో కోట్లాది మంది తమ ఆందోళన, నిరసనలు తెలియస్తున్నారని, దానిలో భాగంగా 7వ తేదిన నగరంలో టీడీపీ, సీపీఐ, జనసేనతో పాటు కలిసి వచ్చే అన్ని రాజకీయ పక్షాలను, ప్రజా సంఘాలను కలుపుకుని ధర్మాగ్రహ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిన నేప థ్యంలో దీనిని ఉమ్మడి సమస్యగా భావించాలని కోరారు. ధర్మాగ్రహ ర్యాలీ జయప్రదానికి అన్ని పార్టీలతో సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ శాంతియుత ర్యాలీకి అనుమతి ఇవ్వాలని జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేశామని, అనుమతి వస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్, తూర్పు ఇన్‌చార్జ్ నజీర్ అహ్మద్, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నాన్ పొలిటికల్ జేఏసీ నాయకులు పీవీ మల్లిఖార్జునరావు, హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు, జిల్లా నాయకులు పుప్పాల సత్యనారాయణ, టీడీపీ నాయకులు చిట్టాబత్తిన చిట్టిబాబు, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, సీపీఐ నగర నాయకులు చల్లా మరియదాసు, దూపాటి రత్నం, నూతలపాటి చిన్న, పలువురు టీడీపీ, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పెదగొట్టిపాడు సాంఘిక బహిష్కరణ సంఘటనలో హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని సామాజిక వేత్త, ఐడియా ఇద్వా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గోళ్ళమూడి రాజా సుందర బాబు ప్రభుత్వాన్ని కోరారు. రాజసుందర్ బాబు ఆధ్వర్యంలో పెదగొట్టిపాడు సాంఘిక బహిష్కరణ బాధితుల కమిటీ హైకోర్టు ఇచ్చిన 7 పేజీల తీర్పును జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ చంద్రశేఖర్‌కు అలాగే జిల్లా ఎస్పీకి అందించి న్యాయం చేయమని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ గొళ్ళమూడి మాట్లాడుతూ హైకోర్టు తీర్పులో జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీల రూల్ 12 సబ్ రూల్ ఒకటి ప్రకారం పెద గొట్టిపాడు గ్రామాన్ని సందర్శించి బాధితులు చెప్పే విషయాలను విని వాటిని పరిగణంలోకి తీసుకుని వాటిని రికార్డు చేసి జీవో నెంబర్ 95 ప్రకారం నష్టపరిహారాలు ఇచ్చేందుకు 8 వారాల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. ఎఫ్ఐఆర్ నమోదు దశలోనే బాధితులకు నష్టపరిహారాలు అందించాలని ఉన్న మార్చి నెలలో వచ్చిన ఆర్డీఓ, పిడి డిఆర్డిఏ, డిడి సోషల్ వెల్ఫేర్, ప్రత్తిపాడు తాసిల్దార్ వీరు ఎవరు కూడా బాధితులు చెప్పిన అంశాలను రికార్డు చేయకుండానే వారికి అన్యాయం చేశారని బాధితుల కమిటీ నాయకులు డీఆర్వోకి ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. కమిటీ నాయకులు బెజ్జం అన్నపూర్ణ, బూసి జ్ఞానమ్మ, కొచ్చర్ల మూర్త మ్మ, బూచి శివ, నాగేంద్రం, బూసి శెవరమ్మ, బూసి మౌనిక, పిల్లి ప్రభావతి పాల్గొన్నారు.

ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యం అభినందనీయం

విశాలాంధ్ర-ఫిరంగిపురం: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక సంకల్పంతో ప్రతి ఇంటి వద్దకు కార్పోరేట్ స్థాయి వైద్య సదుపాయాన్ని ప్రజలకు కల్పించడం ఎంతో అభినందనీయమని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక సెయింట్ ఆన్స్ తెలుగు మీడియం ఉన్నత పాఠశాలలో సచివాలయం-1కు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం గురు వారం నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న సురేష్‌కుమార్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను సందర్శించి వైద్యులను ప్రజలకు అందించే వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు, పెద్దలకు కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. అదేవిధంగా ఐసిడియస్ అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన వివిధ రకాల వంటకాల పౌష్టికాహార పదార్థాలను సురేష్‌కుమార్ పరిశీలించి రుచి చూసి వారికి కితాబిచ్చారు. కార్యక్రమంలో డ్వామా పిడి. యుగందర్ కుమార్ జడ్పిటిసి దాసరి కత్రేణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు మార్పుల శివరామిరెడ్డి, సర్పంచ్ మేడా బాబు, వైస్ సర్పంచ్ ఎంగ్రెడ్డి రమాదేవి, వైకాపా నాయకులు పెరికల జేమ్స్, కొమ్మారెడ్డి, తహశీల్దార్ డి.పద్మనాభుడు, ఇమ్యూనిజేషన్ అధికారి కె.వి.సుబ్బరాజులు, డా.ఎస్తేరు రాణి, సెక్రటరి విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు మద్దతుగా సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్

గుంటూరు: విప్రో కేర్స్ సహకారంతో సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ ఏడవ ఎడిషన్‌ను ప్రారంభించామని విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ ప్రకటించింది. ఇది 12వ తరగతి, తత్సమాన విద్య అనంతరం ఉన్నత విద్యాభ్యాసం చేయాలని కోరుకునే వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థినులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఛత్తీస్‌గఢ్‌లలోని విద్యార్థినులు ఈ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యతో, అట్టడుగు స్థాయిలలో సామాజిక మార్పును పెంపొందించాలన్న తమ నిబద్ధతను ఈ స్కాలర్‌షిప్ కార్యక్రమం ప్రతిబింబిస్తుందని విప్రో లిమిటెడ్ సస్టైనబిలిటీ అండ్ సోషల్ ఇనిషియేటివ్స్ గ్లోబల్ హెడ్ పిఎస్ నారాయణ్ వ్యాఖ్యానించారు.

సోచ్ నుంచి త్యోహార్ ఫెస్టివ్-23 కలెక్షన్

గుంటూరు: అతిపెద్ద మహిళల ఎత్నిక్ దుస్తులు బ్రాండ్ సోచ్, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పండుగ కలెక్షన్ త్యోహార్ ను విడుదల చేసింది. ఈ కలెక్షన్ సాంప్రదాయ ప్రింట్లను సమకాలీన డిజైన్లతో సజావుగా మిళితం చేయడం ద్వారా సీజన్ యొక్క సారాంశాన్ని సంగ్రహిస్తుంది. పండుగ సీజన్లో తమదైన ముద్ర వేయడానికి రూపొందించబడిన ప్రత్యేకమైన దుస్తులను త్యోహార్ కలిగి ఉంది. పెప్లమ్ టాప్ ల నుండి షరారాలతో జత చేయబడిన కప్తాన్లు, చురీదార్ సెట్లు, గౌన్లు, చీరల వరకు ప్రతి ఒక్కటీ హస్తకళ ఆధునికతకు నిదర్శనంగా నిలుస్తుంది. ఈ కలెక్షన్ వివిధ ప్రింటింగ్ పద్ధతులు, నేటి మహిళల డైనమిక్ ప్రాధాన్యతలకు అనుగుణంగా సోచ్ యొక్క దృష్టిని ఏకీకృతం చేసే ప్రామాణికమైన జాక్వర్డ్ వీవింగ్ పద్ధతుల నుండి ప్రేరణ పొందింది. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ కలెక్షన్ ను ఆవిష్కరించారు. రూ.1999 ప్రారంభ ధరతో, త్యోహార్ కలెక్షన్, ఆన్లైన్ లోనూ, సోచ్ అవుట్లెట్లలో అందుబాటులో ఉంది.

ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వాలు: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు : అధికారంలోకి రాకముందు నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక దొంగ హామీలు ఇచ్చి నేడు వాటిని అమలు జరపకుండా ప్రజలను మభ్యపెడు తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ నగర సమితి సభ్యుల సమావేశం గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో నగర కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వాలను 2024లో ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. అనంతరం గత సమావేశం నుంచి ఈ సమావేశం వరకు నగరంలో నిర్వహించిన పార్టీ కార్యకలాపాలను నగర కార్యదర్శి కోట మాల్యాద్రి వివరించారు.

అందరూ నేత్ర పరీక్షలు చేయించుకోవాలి

విశాలాంధ్ర, తెనాలి : తెనాలి, ప్రకాశం రోడ్డులోని ఏఎస్ఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, హెల్త్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్ వాడటం వలన ఎప్పటికప్పుడు తరచుగా కంటి పరీక్షలు చేయించుకోవడం సముచితమని అన్నారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలతో పాటు షుగర్, బిపి పరీక్షలు సుమారు 450 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, మానవత సంస్థ అధ్యక్షులు కొలసాని రాంచంద్, డి.వి.సోమయ్యశాస్త్రి, జి.నాగేశ్వరరావు, శర్మ, సునీల్, జ్యోతి ప్రభృతులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరే షన్: గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఒకే కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా ఓటర్ల జాబితాకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూపర్వైజర్లు, బిఎల్ఓలను నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి ఆదేశించారు. గురువారం కమిషనర్ చాంబర్ లో ఏఈఆర్ఓలు, సూపర్వైజరి అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నగరంలోని రెండు నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఒకే కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-మంగళగిరి: నియోజకవర్గంలో టీడీపీ నాయకులు చేపట్టిన రిలే నిరహారదీక్షలు 22వ రోజుకు చేరుకున్నాయి. "బాబుతో -నేను" పేరుతో మంగళగిరి మండలం పెదవడ్లపూడి టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గురువారం దీక్షలు చేపట్టారు. నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, మంగళగిరి రూరల్ మండల అధ్యక్షులు తోట పార్థసారథిలు దీక్షలను ప్రారంభించారు. 93 సంవత్సరాల యేళ్ళ నాగేంద్రమ్మ ఉదయం నుంచి సాయంత్రం వరకు దీక్షలో కూర్చున్నారు. పెదవడ్లపూడి గ్రామం నుంచి పెద్ద ఎత్తున మహిళలు, సిపిఐ, జనసేన, నాయకులు, రైతు కూలీలు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షలో కూర్చున్న వారిలో గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్, మంగళగిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కొడవలి ఆనంద్, సీనియర్ నాయకులు మాదాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

అప్పిరెడ్డికి సీఎం బర్త్‌డే గిఫ్ట్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎమ్మెల్సీ, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు లేళ్ళ అప్పిరెడ్డికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బర్త్‌డే గిఫ్ట్ అందించారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి విప్‌గా నియమించారు. శాసనమండలి విప్‌గా లేళ్ళ అప్పిరెడ్డి నియమితులవడం పట్ల సర్వత్రా సంపూర్ణ హర్షం వ్యక్తంచేశారు. అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా బృందావన్‌గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో పూర్తి సందడి వాతావరణం నెలకొంది. పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు, అధికారులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో లేళ్ళ అప్పిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. వారిలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యేలు మద్దాళి గిరి, మహ్మద్ ముస్తఫా, తాడికొండ ఇన్‌ఛార్జ్ కత్తెర సురేష్, జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా, డిప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్, మిర్చియార్డు వైస్ ఛైర్మన్ షేక్ మాబు సుభానీ, దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు ఉన్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీకి బెస్ట్ అవార్డ్

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీకు ఇంగ్లాండ్‌లోని ప్రతిష్టాత్మక కేంబ్రిడ్జి యూనివర్సిటీ ఇంగ్లీష్ అసెస్మెంట్ విభాగం నుంచి సౌత్ ఆసియా బెస్ట్ స్టూడెంట్ సపోర్ట్ సెంటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు లభించిందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల శ్రీలంక దేశంలోని కొలంబోలో జరిగిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఫర్ సెంటర్ లీడర్స్ ఆఫ్ సౌత్ ఆసియా' అనే కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీకు సౌత్ ఆసియా బెస్ట్ స్టూడెంట్ సెంటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును అందజేసినట్లు వెల్లడించారు. అంతేకాకుండా 2023లో కేంబ్రిడ్జి సౌత్ ఆసియా బెస్ట్ ప్రాక్టీసెస్ అండ్ సపోర్ట్ ఫర్ టీచర్స్ అండ్ స్టూడెంట్స్ అవార్డ్ లభించిందని తెలియజేసారు. ఇంగ్లండ్‌లోని ప్రఖ్యాత యూనివర్సిటీ కేంబ్రిడ్జితో విజ్ఞాన్ యూనివర్సిటీకి ఉన్న అవగాహన ఒప్పందం మేరకు కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు ప్రత్యేక కోర్సులు అమలు చేస్తున్నామని తెలిపారు. పలు అంశాలను పరిగణలోనికి తీసుకుని కేంబ్రిడ్జి యూనివర్సిటీ ఇంగ్లీష్ అసెస్మెంట్ విభాగం నుంచి సౌత్ ఆసియా బెస్ట్ సపోర్ట్ సెంటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డుతో పాటు ఆథరైజ్డ్ సెంటర్‌గా నిలిచిందని చెప్పారు.

మేధో సంపత్తిని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఉపాధ్యాయులు తమ మేధో సంపత్తిని పెంపొందించుకోవాలని, తమ జీవిత కాలంలో కనీసం నాలుగు తరాల భవిష్యత్ ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని రాజనీతి శాస్త్ర శాఖాధిపతి ఎన్.తిరుపతయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడు తన బోధనా పద్ధతులను పున:సమీక్షించుకుని తదనుగుణంగా విద్యార్థులను నవ సమాజానికి అందించాలని కోరారు. దేశానికి పరశోధకులు కావాలని, వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని చెప్పిన అబ్దుల్ కలాం మాటలకు సార్ధకత చేకూర్చాలని సూచించారు. విద్యావేత్త చంద్రయ్య మాట్లాడుతూ విద్యను పొందటం మాత్రమే హక్కు కాదు..సరైన ఉపాధ్యాయుడి వద్ద విద్యను అభ్యసించటం కూడా హక్కేనన్నారు. ఈ కార్యక్రమంలో సింగరయ్య, రవిబాబు, సదాశివం తదితరులు ఉన్నారు.

అప్పిరెడ్డి జన్మదిన వారోత్సవాలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పుట్టినరోజు వారోత్సవాలలో భాగంగా గుంటూరులోని పలు ప్రాంతాలలో గురువారం వినూత్న సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు దుస్తులు పంపిణీ..అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థలో ఛైర్మన్ బత్తుల దేవానంద్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరల పంపిణీ...మహిళా విభాగం, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గనిక జాన్సీ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ఆశ్రమంలో దివ్యాంగుల నడుమ కేక్ కటింగ్..ఏఆర్ యుఆర్ యూత్ నేతలు ఆజమ్ మాలిక్, చల్లా కోటి ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని అన్ని అనాధ వృద్ధ, దివ్యాంగుల ఆశ్రమాలలో కేక్ కటింగ్ కార్యక్రమాలతో పాటు పండ్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, బందా రవీంద్రనాథ్, బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ, షేక్ రోషన్, వెలుగూరి రత్నప్రసాద్, రెడ్డి కోటేశ్వరరావు, గిరి రాము, విద్యార్థి విభాగం రీజనల్ కోఆర్డినేటర్ విఠల్, జిల్లా అధ్యక్షుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు సంస్మరణ సభ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: కాట్రగడ్డ ఫౌండేషన్ చైర్మన్ స్వర్గీయ కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు సంస్మరణ సభ ఘనంగా జరిగింది. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు ఆయన బాల్య మిత్రులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాట్రగడ్డ ఫౌండేషన్ ద్వారా లక్ష్మీ నరసింహారావు అందించిన సేవా కార్యక్రమాలను మననం చేసుకున్నారు. రాష్ట్రంలో రెండు దశాబ్దాల క్రితమే సాంకేతిక విప్లవాన్ని వ్యాప్తి చేయడంలో లక్ష్మీనరసింహారావు పాత్ర కీలకమని పలువురు గుర్తు చేశారు. చిలువూరు గ్రామాన్ని రాజీవ్ ఇంటర్నెట్ ఇంటర్నెట్ విలేజ్‌గా రూపొందించి సాంకేతిక విప్లవాన్ని విస్తృతపరిచారన్నారు. అలాగే గ్రామంలో జన్మభూమి స్ఫూర్తితో రహదారులు నిర్మించడం, సోలార్ లైట్లు పంచి బాలిక విద్య పెంపొందించేందుకు అవసరమైన తోడ్పాటు అందించడంతో పాటు యోగ అభ్యాసన ద్వారా ఆరోగ్య పరిస్థితి మెరుగుపరిచేందుకు అవసరమయ్యే అవగాహన శిక్షణ శిబిరాలు నిర్వహించి లక్ష్మీనరసింహారావు తన సేవాభావాన్ని చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ళ నరేంద్ర, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, టీడీపీ నాయకులు నన్నపనేని రాజకుమారి, డా.రాయపాటి శ్రీనివాస్, డా.చల్లగుండ్ల శ్రీనివాస్, నాదెండ్ల బ్రహ్మం చౌదరి, గొట్టిపాటి రామకృష్ణ, అబ్బూరి మల్లికార్జునరావు, ఎన్ఆం ఐలు సతీష్ వేమన, గుత్తికొండ శ్రీనివాస్, ఉయ్యూరు శ్రీనివాస్‌తో పాటు లక్ష్మీ నరసింహారావు బాల్య మిత్రులు, సన్నిహితులైన మండవ వెంకట రామయ్య సామినేని కోటేశ్వరరావు, గోరంట్ల పున్నయ్య చౌదరి, రంగిశెట్టి రమేష్, జగదీష్ వెంకటరాయుడు, గ్రామ సర్పంచి చిలువూరు మాణిక్యమ్మ, గ్రామ టీడీపీ అధ్యక్షులు తోటకూర సీతారామయ్య, విశ్రాంత మున్సిపల్ కమిషనర్ దేవినేని కరుణ చంద్రబాబు, మాజీ జడ్పీటీసీ యడ్ల వెంకట్రావు, ఎంపీటీసీలు జమీన్ సాధిక్, గ్రామ పెద్దలు నివాళులర్పించారు.

ట్రాఫిక్ నియంత్రణలో వైఫల్యం

విశాలాంధ్ర-తాడేపల్లి: ఉండవల్లి సెంటరు కూడలి వద్ద గురువారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ప్రతిరోజూ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరేటట్లు లేదు. ట్రాఫిక్ కష్టాలను నియంత్రించడంలో అధికారులు వైఫల్యం కనిపిస్తుంది. ఇరుకు రోడ్లపైనే వాహనాల పార్కింగ్ చేయడం వలన పలు షాపులకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్ పైనే వాహనాలు పార్కింగ్...నిత్యం వాహనదారులకు నరకం చూస్తున్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

రైతులకు రూ.5 లక్షలు విరాళం

విశాలాంధ్ర-తుళ్లూరు : చింతలపూడి గ్రామానికి చెందిన రావిపాటి ఉదయ్ కుమార్ అనే వ్యక్తి అమరావతి రైతులకు రూ.5 లక్షలు విరాళం అందించారు. తుళ్ళూరు దీక్ష శిబిరానికి రూ.2,50,000, కొండమరాజుపాలెం ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు రూ.2,50,000 న్యాయ పోరాటం కోసం అందించారు. అనంతరం రైతులు చేస్తున్న ఉద్యమానికి ఉదయ్ కుమార్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరావతి రైతులు, మహిళలు, రైతు కూలీలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడ
ఎఫ్.ఏ.నెం.386/2023

బిట్వీన్:
ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, రిజిష్టర్డ్ ఆఫీస్: 12&13 ఫ్లోర్, నార్త్‌వింగ్, టవర్-4, నెస్కో ఐటి పార్క్, నెస్కో సెంటర్, వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే, గూరిగోన్ (తూర్పు), ముంబై - 400063
... పిటీషనర్ / అప్పిలెంట్ / ప్రతివాది
వర్సెస్
1. కొండేపు వెంకటలక్ష్మీజ్యోతి, భర్త. కొండేపు అంకమ్మరావు, డోర్ నెం.15-15-178,2/6 లైన్, యాదవ బజారు, పాత గుంటూరు.
... రెస్పాండెంట్ / కంప్లైనెంట్
3. ది. మేనేజర్, ఆంధ్రబ్యాంకు, బ్రాంచి అడ్రస్: హిందూ కాలేజి క్యాంపస్ అపోజిట్, వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరం, గుంటూరు.
...రెస్పాండెంట్ / ప్రతివాది
నోటీసు
మహారాజశ్రీ కమీషన్ వారు పైన తెలిపిన 1వ ప్రతివాదికి నోటీసు పంపినప్పటికి తగు చిరునామా కాదని తిరిగి వచ్చిన దృష్ట్యా కమీషన్ వారు ఇందులోని వాదికి నోటీసును పత్రికా ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డర్ వేసియున్నారు. సదరు ఆర్డర్ ప్రకారం పత్రిక ప్రకటన ద్వారా ఇందులోని 1వ ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా... వాది సి.సి.నెం. 238/2019 అను కేసు నెంబరు మీద కన్స్యూమర్ కమీషన్ గుంటూరు మీద అప్పీలు చేసి ఉండగా మీ నోటీసు కొరకు ది.25-10-2023కు వాయిదా వేయడమైనది. కనుక మీరు ప్రత్యక్షంగా గానీ లేదా మీ తరపున ప్లీడరు గారు ద్వారా గానీ ది.25-10-2023న ఈ కమీషన్ ముందు హాజరు కాగలరు.
వాయిదా తేదీ: 25-10-2023
/// కమీషన్ వారి ఉత్తర్వుల ప్రకారం ///
కె. వెంకటేశ్వర ప్రసాద్, అడ్వకేట్
కృష్ణలంక, విజయవాడ. సెల్: 9440698216

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు సిటి, ముత్యాలరెడ్డి నగర్ 8వ లైను, శ్రీ బాలాజి రెసిడెన్సీ, ఫ్లాట్ నెం.202, డోరు నెం.4-24-31రు కాపురస్తులు **కేసాని శేషగిరిరావు గారి కుమారుడు కేసాని కమలాకర రావు (సెల్ : 9397603690)** అను నేను నా పేరిట గల **పాస్‌పోర్ట్ నెం.E89883502** ఒరిజినల్‌ను **ది.02-09-2023**న నా ఇంటి నుండి అరండల్‌పేట సెంటర్‌కు మోటారు సైకిల్‌పై వెళ్ళుచుండగా ఎక్కడో పోయినది. ఎవరికైనా సదరు పాస్‌పోర్ట్ దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

దస్తావేజు, పాస్‌బుక్ పోయినవి

గుంటూరు జిల్లా, గుంటూరు రూరల్ మండలం, చినపలకలూరు, డోరు నెం.2-35రు కాపురస్తులు లేటు **బొందలపాటి పరశురామయ్య** గారి భార్య **బొందలపాటి సాంబ్రాజ్యం అలియాస్ సాంబ్రాజ్యమ్మ (సెల్: 9160266014)** అను నేను నా పేరిటకు రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు **నెం.2458/1995** మరియు సదరు దస్తావేజు తాలూకు వట్టాదార్ పాస్‌బుక్ **వట్టా నెం.580** ఒరిజినల్స్‌ను **ది.28-09-2023**న నా ఇంటి వద్ద నుండి పెదపలకలూరు సెంటర్‌లోని ఫోటోస్టాట్ షాపునకు జిరాక్సు నిమిత్తం ఆటోలో వెళ్ళుచుండగా పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

CHANGE OF NAME

I, **PATAN AFEEFA AZMI** (Old Name), D/o. Pathan Chand Basha, R/o. D.No. 26-11-37, Maseed Veedhi, Nagarampalem, Guntur - 522004, Guntur District, Andhra Pradesh, have changed my name to **PATHAN AFEEFA AZMI**. Hereafter my name is known as **PATHAN AFEEFA AZMI**.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు సిటీ, 7/4 అరండల్‌పేట, కాపురస్తులు **లేటు పెద్దింటి శ్రీనివాసాచార్యులు గారి కుమారుడు పెద్దింటి కృష్ణ చైతన్య (సెల్ : 9705566094)** గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా, నా క్లయింటుకు సంబంధించిన ఒరిజినల్ విక్రయ దస్తావేజు **ది.09-09-1941 సం॥., డ.నెం.3334/1941,** యస్.ఆర్.ఓ. గుంటూరు అను దస్తావేజు నా క్లయింటు అరండల్‌పేట మెయిన్‌రోడ్డులో ఫోటోస్టాట్ తీసుకొని వస్తుండగా సదరు ఒరిరిజనల్ దస్తావేజు కనబడకుండా పోయినవి. దరిమిలా ఎంత వెతికిననూ దొరికియుండలేదు. కనుక నా క్లయింటుకు సంబంధించిన ఒరిజనల్ దస్తావేజు ఎవరికైనా దొరికినా, నా క్లయింటుకు తిరిగి ఇవ్వవలసినదిగా తెలియజేయడమైనది.

కె.వి.శ్రీరామ్ సుబ్బారావు, అడ్వకేటు,
6/4, అరండల్‌పేట, గుంటూరు

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు

విశాలాంధ్ర-వినుకొండ: హనుమాన్ నగర్‌లో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామాన్ని, ప్రతి ఇంటిని జల్లెడ పట్టి, ప్రతి ఒక్కరికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యల్ని గుర్తించి వారికి ఉచితంగా వైద్యం, మందులు అందించడంతో పాటు సలహాలు, సూచనలు ఇవ్వడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సాయం చేసినా ఆరోగ్యం విషయాల్లో చిన్న కుటుంబాలు మెరుగైన వైద్యం చేయించుకోలేక పోతున్నాయని, వారికి జగనన్న ఆరోగ్య సురక్ష చాలా మంచి కార్యక్రమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పగడాల వెంకటరామిరెడ్డి, యార్డ్ చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, కౌన్సిలర్ షకీలా, జడ్పీటీసీ సభ్యులు జి స్వేనాం, ముస్లిం మైనార్టీ నాయకులు పిఎస్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ డిఈ వెంకయ్య, శానిటరీ అధికారి చెన్నకేశవులు, డాక్టర్ల బృందం పాల్గొన్నారు.

పాడి రైతులు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ఈపూరు : పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం మంజూరవుతున్న రుణాలను పాడి రైతులు సద్వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పయ్యావుల శ్రీనివాసమూర్తి అన్నారు. మహిళ పాడి రైతులకు జగనన్న పాల వెల్లువ రుణమేళా కార్యక్రమాన్ని మండలంలోని గుండేపల్లి గ్రామ సచివాలయ పరిధిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ మహిళా పాడి రైతులకు వర్కింగ్ కాపిటల్ కింద ఒక్కొక్క గేదెకు ప్రధాన మంత్రి పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రూ.30 వేలు చొప్పున, మరో రూ.70 వేలు జీడీసీసీ బ్యాంకు ద్వారా అందించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో పాడి పరిశ్రమకు గత వైభవాన్ని తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే పశుసంవర్ధక శాఖ ద్వారా రాయితీపై పశుగ్రాస విత్తనాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ కొచ్చర్ల పశువైద్యాధికారి ఎస్.శ్రీరాములు, డీఆర్‌డీఏ వెలుగు సిబ్బంది మహిళా పాడి రైతులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు కారంపూడి విద్యార్థులు

విశాలాంధ్ర-కారంపూడి : స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు అనంత శివ గురువారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో గత ఆదివారం నరసరావుపేటలోని శంకర భారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-18 బాలబాలికల జిల్లా జట్లు ఎంపికలు జరిగాయని తెలిపారు. జట్ల ఎంపికలో పదవ తరగతి చదువుతున్న షేక్ షారుక్, సీహెచ్ నాగవర్ధన్, కామాక్షి, అనూష, తొమ్మిదవ తరగతి చదువుతున్న షాన్వాజ్, ఎనిమిదవ తరగతి చదువుతున్న ఏసమ్మ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు చిత్తూరు జిల్లా యదమరి గ్రామంలో జరుగు రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు స్వర్ణ రాజు, శ్రీనివాసరావు తెలియజేశారు. క్రీడాకారులకు జరిగిన అభినందన సభలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

ప్రజారోగ్యానికి రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-దుర్గి : ప్రజారోగ్యానికి రక్ష జగనన్న ఆరోగ్య సురక్ష అని తహశీల్దార్ జి.రమేష్ కుమార్, ఎంపీడీవో కె.సమతా వాణి అన్నారు. మండల పరిధిలోని కోలగుట్ల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజల చెంతకే వైద్యం, ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.శివరామకృష్ణ, ఈవోపీఆర్డీ గుప్తా, సర్పంచ్ మద్దికర మహాలక్ష్మీ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ నక్కా ఆదినారాయణ, సెక్రటరీ శివశంకర్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-శావల్యాపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినుకొండ నియోజకవర్గ అండర్-17 బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక పోటీలలో మండలంలోని వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన కీర్తి, భార్గవి, సాయి సుష్మ, త్రిషలు నియోజకవర్గ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా జట్టు ఎంపికలకు అర్హత సాధించారని హెచ్‌ఎం షేక్ మాబుసుభాని గురువారం తెలిపారు. 6 నుంచి చేబ్రోలు మండలం వేజండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల్లో నిర్వహించే అండర్-17 ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు ఎంపికల్లో వారు పాల్గొంటారని పీఈటీ కాకుమాను రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పీఎంసీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఆలయ పునర్నిర్మాణానికి భారీ విరాళం

విశాలాంధ్ర-వినుకొండ: కొండపైన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి పట్టణ ప్రముఖ వ్యాపారస్తులు శ్రీ వైష్ణో ఫర్టిలైజర్స్ అధినేత గుర్రం యలమందయ్య శెట్టి కుటుంబ సభ్యులు రూ.2,01,116 వినుకొండ పట్టణ అభివృద్ధి సేవా సంఘం పులిపాటి రామారావుకు అందజేశారు. వారు మాట్లాడుతూ అతి పురాతన దేవాలయంలో మాకు అవకాశం కల్పించిన కమిటీ వారికి ధన్యవాదాలు తెలిపారు సెక్రెటరీ జాజుల మాల్యాద్రి, ట్రెజరర్ రెడ్డి. నగేష్, బాబు పెండ్యాల పుల్లారావు, గంధం బాలిరెడ్డి, గజవల్లి పవన్, చందోలు మల్లికార్జునరావు, కొత్తమాసు శివ దండు. చెన్నయ్య, జాగర్లమూడి. సుబ్బారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

విశాలాంధ్ర-రెంటచింతల : తుమ్మకోట జడ్పీ హైస్కూల్‌ను జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో యార్ల మహాలక్ష్మితో కలసి ఎంపీపీ దాసరి చౌడేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, మెను తప్పక పాటించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వీఆర్వో కటికల బాలయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

కుట్రపూరిత రాజకీయాలు ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించటానికి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరుగుతున్న దీక్షలకు గురువారం ఆయన పార్టీ నాయకులతో కలసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని మోదీ, అమిత్ షాలు రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ నియంతృత్వ పాలనకు మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి జగన్ తన సొంత ప్రయోజనాల కోసం ఢిల్లీ వెళుతున్నారని విమర్శించారు. కేంద్రం అండదండలతో జగన్ లక్షల కోట్ల అప్పులు తెస్తున్నారని, రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించారని ఆరోపించారు. నారా చంద్రబాబునాయుడి అరెస్టు అప్రజాస్వామికమైనదని, ప్రతిఒక్కరు దీన్ని ఖండించాలన్నారు. జనసేన అధినేత పవన్ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారని, ప్రజాస్వామ్య పరిరక్షణకు రాష్ట్రంలో కలసికట్టుగా ముందుకు వెళ్లాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ రాజకీయ కుట్ర, అక్రమాలకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధంగా ఉన్నామని... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక పరాకాష్ట నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రపూరిత రాజకీయాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టడానికి ప్రతిఒక్కరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ, రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, మహిళా సమఖ్య ఏరియా కార్యదర్శి చేరుకుపల్లి నిర్మల, నాయకులు బొంతా భగత్‌సింగ్, చౌటుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక ఉగ్రవాది జగన్: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: టెర్రరిస్టులు కన్నా ఆర్థిక ఉగ్రవాదిగా తయారైన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరింత ప్రమాదకరమని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ తక్షణం జైలు నుండి విడుదల కావాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో స్థానిక అరుణ హాల్ సెంటర్లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. దీక్షలో గురువారం నూజెండ్ల మండల టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళ్లకు గంతలు కట్టుకొని ప్రభుత్వంపై వినూత్నంగా తమ నిరసన కార్యక్రమాన్ని తెలిపారు. ఈ సందర్భంగా జీవి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్టీ రామారావు స్ఫూర్తితో చంద్రబాబు తెలుగు రాష్ట్రాలను ఎంతో అభివృద్ధిలో ఉంచారన్నారు. ఈ నాలుగేళ్లుగా అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు. దోచుకొని దాచుకోవడం తోటే కాలం గడిపారన్నారు. అన్ని వ్యవస్థలపై అధికారులను లోబరుచుకొని అందిన కాడికి దోచుకుంటున్నారని జీవి అన్నారు. వీటన్నింటికీ చరమగీతం పాడే రోజులు దగ్గరలో ఉన్నాయని. నిర్దోషిగా చంద్రబాబు విడుదలవుతారని. రానున్న ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధిస్తుందని. అప్పుడు అవినీతి వైసీపీ నేతలు. అవినీతి అధికారులు జైలుకెళ్లటం ఖాయమని జీవీ జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నూజెండ్ల మండల పార్టీ అధ్యక్షుడు మీసాల మురళి కృష్ణ యాదవ్, డి.ఎల్.డి.ఏ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, ముంద్రు సుబ్బారావు, బచ్చు అంజిరెడ్డి, సోమేపల్లి బ్రహ్మయ్య,వంకాయలపాటి పేరయ్య, రొండ్ల వీరాంజనేయ రెడ్డి,నంబుల గురునాథం,రావుల మల్లేశ్వరరావు, మరిడి సురేష్,లగడపాటి సూరి,గంగినేని ఆంజనేయులు,కుంట కోటిరెడ్డి, వడ్లమూడి గలెయ్య,గంగినేని చంద్రశేఖర్, ఎం కొండ రెడ్డి,దగ్గుబాటి లింగయ్య,సింగంసెట్టి శ్రీరామ్ మూర్తి,బత్తుల గోవింద రాజులు,పలిపోగు బలగురవయ్య,కొమ్మ శ్రీను, సత్యనారాయణ,కాకాని హరిబాబు,బర్ల బాసు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి పేదవానికి వైద్య సేవలు అందించి నిరంతర పర్యవేక్షణ ఉండేలా చేపట్టిన కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. నరసరావుపేట రూరల్ మండలం లోని చిన తురకపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమములో స్థానిక శాసన సభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలసి కలెక్టర్ శివశంకర్ గురువారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగములో విప్లవాత్మక మార్పులు చేపట్టిందన్నారు. జిల్లాలో 72 మెడికల్ క్యాంపులు నిర్వహించడం జరిగిందన్ననారు. మెడికల్ క్యాంప్‌లో పరీక్షలు, వైద్యం అనంతరం నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. పల్నాడు జిల్లా 35 శాతం రక్త హీనత ఉన్న కిషోర బాలికలు ఉన్నారన్నారు. వారికి బడిలో అందించే పౌష్టిక ఆహారంతో పాటు ఇంటి వద్ద కూడా ఐరన్ రిచ్ పదార్థాలను అందించాలన్నారు. శాసన సభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మానస పుత్రిక 'బంగారు తల్లి' కార్యక్రమాన్ని చిన తురకపాలెం నుండి ప్రారంభించడం అభినందనీయమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంచి పథకమని దానిని అందరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కు.కల్పశ్రీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డా.బి.రవి, జిల్లా విద్యా శాకాదికారి స్యామ్యూల్, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహనాధికారి మోహన్, మండల రెవిన్యూ అధికార రామణా నాయక్, ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ స్వామీ, సర్పంచ్ ఖాజా, యం.పి.టి.సి మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం

విశాలాంధ్ర-దుర్గి : మండల కేంద్రమైన దుర్గిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో(మొయిన్)కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం అధికారులు శ్రమదానం చేశారు. పాఠశాల పరిసరాలను ఊడ్చి చెత్తా చెదారాన్ని ఎత్తి పారబోశారు. పిచ్చి మొక్కలు పీకారు, అధికారులు, విద్యార్థులు స్వచ్ఛత భారత్ ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ అధ్యక్షతన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శ్రద్ధ వహించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల సమస్యలు ఉండవని సెక్రటరీ కృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బెంజిమెన్, ప్రధానోపాధ్యాయులు అన్వర్ భాష, ఎన్.సైదులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వాసు,అమరయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు,మండల కోఆర్డినేటర్ బెంజిమెన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష, ప్రజలకు రక్ష

విశాలాంధ్ర-బెల్లంకొండ : ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించటమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ సదుద్దేశంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టినట్టు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని మాచాయపాలెం గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. వ్యాధి నిర్ధారణలో శాస్త్ర చికిత్సలు అవసరమని తేలితే ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యాన్ని చేయించుకోవచ్చని ప్రజలకు సూచించారు. చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.వి.టేశ్వరరావు, సిబ్బంది, స్పెషలిస్టు వైద్యాధికారులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : గతానికి భిన్నంగా, రాజకీయాలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా, పారదర్శకంగా సంక్షేమ పథకాలను వైఎస్ జగన్ అందిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. గురువారం అబ్బూరులో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం ముద్రించిన సంక్షేమ పుస్తకాన్ని ఆయన లబ్ధిదారులకు అందించారు. గత నాలుగేళ్లుగా అందిన సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్ల పని తీరు అడిగి తెలుసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలో ఏ నాయకుడు సాహసించని రీతిలో సంక్షేమ, పరిపాలన సంస్కరణలను అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు, సర్పంచ్ గొలదారి అన్నపూర్ణమ్మ, ఎంపీటీసీ మానుకొండ అలేఖ్య, పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని బలుసుపాడు, పరస గ్రామాల మధ్యలో గురువారం ప్యాసింజర్ ఆటో, అశోక్ లేలాండ్ వెహికల్ ఎదురెదురుగా గుద్దుకొనగా ఆటో డ్రైవర్ చిన్న మరియదాసు(42) అక్కడికక్కడే చనిపోయాడు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకూరపాడు ఎస్సై వెంకట్రావు తెలిపారు.

చంద్రబాబు అభిమానిపై వైసీపీ శ్రేణుల దాడి

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆయనకు సంఘీభావంగా పాదయాత్ర చేపట్టిన వృద్ధుడిపై వైసీపీ శ్రేణులు దాడి చేసి గాయపరిచిన సంఘటన వినుకొండ నియోజకవర్గంలోని విఠంరాజుపల్లి గ్రామంలో గురువారం ఉదయం జరిగింది. నంద్యాల జిల్లాకు చెందిన చంద్రబాబు వీరాభిమాని చింతల నారాయణ తమ నేత నారా చంద్రబాబు నాయుడును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపూరితంగా అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించినందుకు నిరసన వ్యక్తం చేస్తూ ఆయనకు సంఘీభావంగా నంద్యాల జిల్లా నుంచి రాజమహేంద్రవరం వరకు నారాయణ పాదయాత్ర కార్యక్రమం చేపట్టాడు. ఇదిలా ఉండగా వినుకొండ మండల పరిధిలోని విఠంరాజుపల్లి గ్రామానికి చేరుకున్న నారాయణను ఆ ప్రాంతంలో కొందరు వైసీపీ శ్రేణులు హఠాత్తుగా నారాయణ మీదకు దాడికి పాల్పడ్డారు. నారాయణకు తీవ్రమైన గాయాలు కావడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడిని ఆసుపత్రిలో మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు పరామర్శించారు.

సీపీఐ సానుభూతిపరుడు సుబ్బారావు మృతి

విశాలాంధ్ర-అమరావతి: మండల పరిధిలోని వైకుంటపురం గ్రామంలో సిపిఐ సానుభూతిపరుడు కొంగలేటి సుబ్బారావు (60) గుండెపోటు కారణంగా మృతి చెందడంతో వైకుంటపురం సిపిఐ శాఖ కార్యదర్శి నండూరు జోజి మృతదేహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-రాజుపాలెం : ప్రతి ఇంటిని జల్లెడ పట్టి దీర్ఘకాలిక, వంశపారంపర్య, సీజనల్ వ్యాధులను గుర్తించి, రోగులను పరీక్షించి, రోగ నిర్ధారణ ఇంటి వద్దనే చేసి, ప్రజల కోసం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటుచేసి స్పెషలిస్ట్ వైద్యులతో సేవలందిస్తూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గురువారం రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సభల్లో ఆయన ప్రసంగించారు. ఆయా కార్యక్రమాలు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేశారు. మంత్రి అంబటితోపాటు పూర్వ శాసనసభ్యులు ఎర్రం వెంకటేశ్వరరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు. అనంతరం శిబిరాల వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహారంపై అవగాహన కల్పించారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులను అందించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీను, మర్రి సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ శానికొమ్ము వెంకట సుబ్బమ్మ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ సంక్షేమ సహవాసం సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో గోగులపాడు గ్రామంలో గల తెలుగు బాపిస్ట్ చర్చిలో గురువారం మండల పాస్టర్ల సంక్షేమ సవాహస సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు వారి సంక్షేమము గురించి చర్చించుకున్నారు. అనంతరం మండల పాస్టర్ల సంక్షేమ సవాహస సంఘం నూతన కార్యవర్గమును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పి.జీవానందం, వైస్ ప్రెసిడెంట్ గా ఎం.క్రాంతి, సెక్రటరీగా జి.నిర్మలమ్మ, వైస్ సెక్రటరీగా ఎం.ప్రభుదాసు, ట్రెజరర్‌గా ఎస్.ఆదాం, వైస్ ట్రెజరర్ గా ఎ.దేవదానం, సలహాదార్లుగా కె.పద్మ, కె.యాకోబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జి.విజయకుమార్, ఎం.పౌల్ ఎన్నికైనారు. నూతనంగా ఎన్నికైన వారిని పాస్టర్లు అభినందించారు.

బాబుకి తోడుగా దీక్ష

విశాలాంధ్ర-సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ గురువారం స్థానిక కన్నా క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో చేపట్టిన 23వ రోజు "రిలే నిరాహార దీక్షలో" మాజీ మంత్రి, టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీవీఐటీలో 'మ్యాడ్' చిత్రబృందం సందడి

విశాలాంధ్ర-గుంటూరు : యువ నటీనటులు నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, గౌరీ ప్రియా రెడ్డి, అనంతిక, గోపికా ఉద్యాన్ ప్రధాన పాత్రదారులుగా కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో హారికా, హాసిని, సితారా బ్యానర్‌పై హాస్యప్రధానంగా రూపొందుతున్న చిత్రం 'మ్యాడ్' ఈ నెల 6న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రచారంలో భాగంగా చిత్రబృందం వీవీఐటీ కళాశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో చిత్రనటులు, వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా పథకాలు అమలు

విశాలాంధ్ర-రెంటచింతల : పార్టీలు, కులమతాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను ఎక్కడా అవినీతి లేకుండా డీబీటీ పద్ధతి ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమచేస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం రెంటచింతల గ్రామంలో 9వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమనికి విచ్చేసిన పీఆర్కేకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ముందుగా దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీఆర్కే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని స్వయంగా తెలుసుకోవడమే కాక తక్షణ పరిష్కారం దిశగా అడుగులు వేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌరెడ్డి, జీఎస్ డబ్ల్యూఎస్ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో యార్ల మహాలక్ష్మి, మండల కన్వీనర్ గొట్టం బ్రహ్మారెడ్డి, జేసీఎస్ పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ మోర్తల ఉమా మహేశ్వర రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ నవులూరి భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి, కంది మర్రెడ్డి, అన్నపురెడ్డి వెంకట స్వామిరెడ్డి, దేవిరెడ్డి నారపరెడ్డి, అన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, తోకల చలమయ్య, పూజల రామయ్య, పేర్ల ముత్తయ్య, పాముల సంపూర్ణమ్మ, తుమ్మా ఇన్నారెడ్డి, ఏరువ ప్రతాపరెడ్డి, అల్లం ప్రతాప్ రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, కొమ్మారెడ్డి మర్రెడ్డి, బద్దూరి బ్రహ్మారెడ్డి, పులి ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్లు పరిశీలించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర-వినుకొండ: సీపీఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలో డబ్బా స్తంభం సెంటర్ నుంచి హనుమాన్ నగర్ వెళ్లే రోడ్డు వరకు పర్యటించారు. స్థానికులు అధ్వానంగా ఉన్న డ్రైనేజీలు రోడ్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మన ఎమ్మెల్యే పదేపదే వినుకొండ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందని చెబుతున్నారు ఇదేనా అన్నారు. ఈ ప్రాంతానికి మంత్రి నేరుగా నాగార్జున గురువారం హనుమాన్ నగర్ పర్యటనకు వస్తున్న సందర్భంగా అయినా మున్సిపాలిటీ అధికారులకు ఈ రోడ్డు కనబడలేదా? మంత్రి వస్తున్న ఈ ప్రాంతాన్ని ఇంత రోతగా ఉంచితే ఇక సాధారణ ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల పరిస్థితి ఏంటి? అని అన్నారు. సీపీఐ వినుకొండ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డులో ఉన్న రోడ్డు పరిస్థితే ఇలా ఇంకా మిగిలిన రోడ్ల పరిస్థితేంటని విమర్శించారు. ఇలాగే కొనసాగితే ఈ ప్రాంత ప్రజలతో త్వరలో మున్సిపాలిటీ ముట్టడి నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అప్పరాజు పవన్, రాయబారం వందనం, పొట్లూరు వెంకటేశ్వర్లు, కొప్పరపు మల్లికార్జున, ఎస్.కె మస్తాన్‌వలి, వెంకటయ్య, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ వైద్యం ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-వెల్దుర్తి : పేద ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ప్రధాన లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రమంతా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. గురువారం కండ్లకుంటలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటిలో సర్వే ద్వారా కుటుంబ ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని, గ్రామంలో జరిగే మెడికల్ క్యాంపులో తగిన వైద్య సహాయం అందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. సర్వేలో దీర్ఘకాలిక వ్యాధులు ఏమైనా ఉంటే ఆరోగ్యశ్రీ ద్వారా అప్పటికప్పుడు మెరుగైన వైద్యశాలలకు రోగులను తరలించడం ద్వారా ప్రజలకు మేలు జరగాలని ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతా శివరామయ్య, జడ్పీటీసీ రూప్లి బాలు నాయక్, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దార్ కోటేశ్వరరావు నాయక్, ఎంపీడీవో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోకి 50 కుటుంబాలు

విశాలాంధ్ర-వెల్దుర్తి : మండల పరిధిలోని గొట్టిపాళ్ళ గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైసీపీలో చేరారు. అందరికీ పార్టీ కండవాలు కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని భూస్థాపితం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీ అవినీతిలో కూరుకుపోయిన పార్టీ అని ఆయన ఎద్దేవాచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-విజయపురి సౌత్ : ఆదరణ మానవ సేవా సహాయ సమితి కార్యదర్శి పలుకూరి జోసెఫ్ బాబు ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లోని లాయల్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ చర్చిలో గురువారం 30 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఏపీఆర్జేసీ అధ్యాపకులు పి.సుబ్బారెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ ఫణీంద్ర కుమార్ హాజరై పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం మేనేజర్ ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ పలు సేవా కార్యక్రమాలు ద్వారా ఆదరణ మానవ సేవా సహాయ సమితి పేదలకు అండగా నిలవడం అభినందనీయం అన్నారు. అధ్యాపకులు సుబ్బారెడ్డి సొంత నిధులను వెచ్చించి నిరుపేదలకు దుప్పట్లు సమకూర్చడం గొప్పవిషయం అన్నారు. మాజీ సర్పంచ్ గంటా సత్యనారాయణ రెడ్డి, జయరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భార్య, అత్తపై కత్తితో దాడి

విశాలాంధ్ర-రెంటచింతల: మద్యం మత్తులో భార్య, అత్తపై దాడికి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన మామిడి జాను బుధ వారం రాత్రి మద్యం సేవించి ఇంటికి చేరాడు. భార్య సుశీల, అత్త శాంత మ్మలపై కత్తితో దాడికి పాల్పడగా ఇరువురికి స్వల్ప గాయాలైనాయి. ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. జాను పరారీలో ఉన్నాడు. సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజీవ్ కుమార్ వెల్లడించారు.

CHANGE OF NAME

I, JASTHI SIREESHA (Old Name), W/o V K KISHORE, Age 39, Residing at 6-215, Gandhinagar, 60 Feet Road, Narasaraopet Town, Palnadu Dist.-522601, A.P. Has changed my name to **JASTI SIRISHA** (New Name). Hereafter my name known as **JASTI SIRISHA**

చిలకలూరిపేట పురపాలక సంఘం

ROC.No : 370/Works/2022/E1 Date : 04.10.2023

E-PROCUREMENT NOTICE

I) 1. Number of Works : 46 (New)
2. Estimate Contract Value : Rs. 3,12,35,189/-.
3. Name of Work : Construction of Roads, Culverts, Drain and HDPE pipe Line at Various Places Chilakaluripet, Municipality Under GGMP.
4. Bid Document download Start date : 06.10.2023 11.00AM
5. Bid Document download End date : 13.10.2023 04.00 PM.
6. Bid Submission Closing date : 13.10.2023 04.30 PM.

II) 1. Number of Works : 6 (New)
2. Estimate Contract Value : Rs. 92,75,220/-
3. Name of Work : Construction of Roads, Culverts, Drain at Various Places Chilakaluripet, Municipality Under GGMP And General Fund.
4. Bid Document download Start date : 06.10.2023 11.00AM
5. Bid Document download End date : 20.10.2023 04.00 PM.
6. Bid Submission Closing date : 20.10.2023 04.30 PM.
7. Name and Address of the Office : Sri .Ch.Govinda Rao, Commissioner, Chilakaluripet Municipality, Chilakaluripet, Ph : 08647- 253994,9849906585
For other details visit https:\tender.apeprocurement.gov.in

స్వచ్ఛ భారత్..... స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్..... స్వచ్ఛ చిలకలూరిపేట

Sd/- Commissioner
Chilakaluripet Municipality

చంద్రబాబు అక్రమ అరెస్ట్ జగన్ తప్పటడుగే..

విశాలాంధ్ర-అద్దంకి: తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ జగన్ తప్పటడుగని, బాబు అక్రమ అరెస్టుపై ప్రజల స్పందన చూసి వైసీపీ నేతలే హడలిపోతు న్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఎద్దేవా చేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిసూ గురువారం కొరిశపాడు మండలం తెదేపా ఆధ్వర్యంలో తెదేపా శ్రేణులు రావినూతల గ్రామం నుంచి రాచపూడి వరకు 10 కిలోమీటర్ల భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో డా.బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతుందని వైకాపా ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. చట్టాన్ని చేతిలోకి తీసుకొని దుర్మార్గమైన ,దుశ్చర్య పాలన చేస్తూ వ్యవస్థల విధ్వంసానికి పాల్పడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో మునుపెన్నడూ లేనివిధంగా కొత్త సాంప్రదాయానికి జగన్‌రెడ్డి పాల్పడుతున్నారన్నారు. అంతిమంగా న్యాయం ధర్మం తప్పక విజయం సాధిస్తుందని,కడిగిన ముత్యంలా చంద్రబాబు కేసు నుండి బయటకు వస్తారని ఎమ్మెల్యే రవికుమార్ ధీమా వ్యక్తం చేశారు.

ఆర్‌సీసీకి సిమెంట్ బెంచీల వితరణ

విశాలాంధ్ర-పర్చూరు: పర్చూరు రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని భువనగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు కొండలరెడ్డి ప్రశంసించారు. పర్చూరు రోటరీ క్లబ్‌కు అనుబంధంగా ఉన్న నాగులపాలెం రోటరీ కమ్యూనిటీ క్లాప్స్‌కు భువనగిరి రోటరీ క్లబ్ వారు 16 సిమెంట్ బెంచీలను గురువారం అందించారు. కొండలరెడ్డి మాట్లాడుతూ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌లో వృద్ధులకు ఉపయోగార్థంగా బెంచీలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి మహ్మద్ హనీఫ్, పుల్లర్సు అసిస్టెంట్ గవర్నర్ ఏడ్పాటిప్రకాశ్‌రెడ్డి, డాక్టర్ బుచ్చిరెడ్డి, పర్చూరు క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, ప్రతినిధులు తేళ్ళ రమేష్‌చంద్ర, కోమటి అంజనేయులు, ఆర్‌సీసీ అధ్యక్షులు చాగంటి నాగేశ్వరరావు, కొల్లా శ్రీనివాసరావు ఉన్నారు.

ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-అద్దంకి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు.జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని చక్రాయపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును కృష్ణచైతన్య ప్రారంభించారు.కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ఈపథకం ద్వారా ప్రజలకు ఇళ్ళ వద్దనే వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికి వచ్చి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తారన్నారు.

పేదల చెంతకు ఖరీదైన వైద్యం

విశాలాంధ్ర-కొల్లూరు: ఖరీదైన వైద్య సేవలను ప్రభుత్వం పేదలకు అందుబాటులోకి తీసుకురావడం హర్షనీయమని కొల్లూరు మండల వైస్ ఎంపీపీ మురాల రాంబాబు అన్నారు. గురువారం కొల్లూరు మండల పరిధిలోని దోనేపూడిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి రమణతో కలసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలోని పేదలకు ఖరీదైన వైద్యం సకాలంలో అందజేయడానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడే వారు ఈఅవకాశాన్ని వినియోగించుకుని వైద్య సేవలను పొందాలని సూచించారు. శిభిరంలో 454 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కళ్ళజోళ్ళు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఐ. సత్యనారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డి రవిబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నగరాజకుమారి పాల్గొన్నారు.

కుట్రతోనే చంద్రబాబుపై అక్రమ కేసులు

విశాలాంధ్ర - రేపల్లె : టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టు రాజకీయ కుట్రలో భాగమని టీడీపీ నాయకులు జీవి నాగేశ్వరరావు అన్నారు. బాబు అక్రమ అరెస్టుకు నిరసనగా చేపట్టిన రిలే దీక్షలు 22 వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో రేపల్లె రూరల్ మండలంలోని చాట్రగడ్డ, మైనేని వారి పాలెం, సింగుపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఎటువంటి ఆధారాలు లేవని చెప్పారు. త్వరలో చంద్రబాబు నాయుడు నిర్దోషిగా బయటకు వస్తారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, లీగల్ సెల్ నాయకులు వై. ధర్మతేజ, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయి అరెస్ట్

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలో ఈ నెల 3 వ తేదీ మంగళవారం రాత్రి జరిగిన మేకా సాయికుమార్ అనే యువకుడి హత్య కేసులో ముద్దాయి బండెల రాకేష్ ఉరఫ్ బ్లేడ్ హర్షను అరెస్టు చేసినట్లు సిఐ నజీర్ బేగ్ తెలిపారు. ఈ మేరకు ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నిందితుడు మద్యం మత్తులో సాయి కుమారును బీర్ బాటిల్‌తో తలపై మోది, విచక్షణ రహితంగా పొడిచి చంపినట్లు చెప్పారు. గురువారం పెనుమూడి చెక్ పోస్ట్ వద్ద ముద్దాయి బండెల రాకేష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఫోర్జరీ సంతకాలపై విచారణ జరిపించండి

విశాలాంధ్ర - బల్లికురవ : ఎలాంటి పంచాయతీ జనరల్ బాడీ మీటింగ్ జరగకుండా పంచాయతీ తీర్మానం లేకుండా వార్డు మెంబర్ల సంతకాలు ఫోర్జరీ చేసి ఫోర్జరీ చెక్ పవర్ అర్జీతో గ్రామంల్లో వర్క్ చేయటం ఏంటని కొండరు వార్డ్ మెంబర్లు ఎంపీడీఓ కలిసి మా సంతకాలు ఫోర్జరీ చేశారని తక్షణమే విచారణ జరిపించాలని వినతిపత్రం అందించారు. మండల కేంద్రమైన బల్లికురవ గ్రామంలో జీలీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి 20 లక్షలు మంజూరు అయ్యాయి.బుధవారం వైకాపా నాయకుడు బల్లికురవ గ్రామంలో నూతనంగా సైడ్ కాలువలు నిర్మాణం కోసం పనులు ప్రారంభించగా వార్డ్ మెంబర్లు దీనిని అడ్డుకున్నారు.పంచాయతీ తీర్మానం లేకుండా ఎలా పనులు చేస్తున్నారని వార్డ్ మెంబర్లు కంగుతిన్నారు.గురువారం దీనిపై ఎంపీడీఓ సిహెచ్ కృష్ణను కలిసి ఎలాంటి పంచాయతీ జనరల్ బాడీ సమావేశం జరగలేదని ఎలాంటి పంచాయతీ తీర్మానాలు ఇవ్వలేదన్నారు.పంచాయతీ సమావేశం జరగకుండా ఎలాంటి తీర్మానం లేకుండా వర్క్ పర్మిషన్ ఎలా వచ్చిందని వారు ప్రశ్నించారు. మా సంతకాలు ఫోర్జరీ జరిగాయని తక్షణమే దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలన్నారు.దీనిపై ఎంపీడీఓను వివరణ కోరగా దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తున్నామన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఎంపీడీఓలు,తహశీల్దార్లు,గృహ నిర్మాణ శాఖ అధికారులతో గృహ నిర్మాణాలు, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణాల పనుల పురోగతిలో నిర్లక్ష్యంచేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీఓలు,గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రతి రోజు జగనన్న లే ఔట్ కాలనీలు తిరగాలన్నారు. జిల్లాలో ఇంకా జగనన్న కాలనీ లే ఔట్లలో గృహ నిర్మాణాలు జరగాల్సిన్నాయి. జిల్లాలో యద్దనపూడి, మార్టూరు గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొల్లూరు,అమృతలూరు మండలాల్లో గ్రామీణ గృహ నిర్మాణాల్లో వెనుకబడిన ఉన్నారన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలకు,ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకు,గడప గడపకు మన ప్రభుత్వం పనులకు నిధుల కొరత లేదని అన్ని పనులకు బిల్లులు వెంటనే చెల్లించడము జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్,గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్,డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్,సి.పి.ఓ భరత్ కుమార్,గ్రామీణ నీటి సరఫరాల శాఖ ఎస్.ఇ విద్యాసాగర్, పంచాయతీ రాజ్ ఎస్.ఇ హరి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య భద్రతే జగన్ ధ్యేయం: కోన

విశాలాంధ్ర - పిట్టలవాని పాలెం : ప్రజల ఆరోగ్య భద్రతే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం అని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండలంలోని పిట్టలవానిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారన్నారు. పేదల ఆరోగ్య సంరక్షణ విషయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు మరో సువర్ణాధ్యాయమని చెప్పారు.ప్రతి పేదవాడు అనారోగ్యం కారణంగా అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చారన్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అయిన ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేశారన్నారు. పేదవారు ఎలాంటి పరిస్థితుల్లోను అనారోగ్యం బారిన పడ కూడ దనే ఉద్దేశంతో ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్ అమల్లోకి తెచ్చారని చెప్పారు.జగనన్న సురక్ష కార్యక్ర మంలో అనుభవజ్ఞులైన వైద్యులు, వైద్య సిబ్బంది శిబి రాల్లో ఆరోగ్యానికి సంబంధించిన వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారని, శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన చికిత్స అందించేందుకు పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేస్తారని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎంపీడీవో శేషమాంబ, తాసిల్దార్ కవిత, ఈఓపిఆర్డి రాధిక, పిహెచ్‌సి వైద్యులు లీలా కాంత్, లోకేష్, సిబ్బంది నరసింహారావు,ప్రశాంతి, అంగన్వాడీ సూపర్వైజర్ అరుణకుమారి, ఎంటమాల వెంకటేశ్వరరావు,సర్పంచ్ ఏక్టా అశ్విని, మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ లీల శ్రీనివాస్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు కోటి రెడ్డి, కోమలి సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు

విశాలాంధ్ర - రేపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ విజయ సారథి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ విజయ సారధి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో ఆరోగ్య సురక్ష ప్రవేశపెట్టినట్లు చెప్పారు.సాధారణ వ్యాధులతో పాటు స్పెషలిస్టులు ఈ వైద్య శిబిరంలో పాల్గొంటున్నట్లు తెలిపారు.ప్రజలు అవసరాలకు తగిన విధంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు.అనంతరం ఆరోగ్యసురక్ష ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ ఫుడ్‌లను పరిశీలించారు. పిల్లలకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించడం ద్వారా వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జి. ప్రశాంత్ కుమార్, వార్డు కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్య అంతిమ లక్ష్యం సంఘ సంస్కరణే

విశాలాంధ్ర - చీరాల : విద్య కేవలం సరుకు కాదని,విద్య యొక్క అంతిమ ప్రయోజనం సంఘ సంస్కరణ అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు.అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్బంగా చీరాల పాత రైల్వే గేటు వద్ద విద్య సమాజం సంఘ సంస్కరణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ విద్య యొక్క ప్రయోజనం సంఘ సంస్కరణతో పాటు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తోడ్పడాలన్నారు. విద్యార్థులకు మార్కులు కొలబద్ద కాదని,ఉపాధ్యాయుడు యంత్రం కాదని విద్య యొక్క అంతిమ లక్ష్యం సంఘ సంస్కరణ కావాలన్నారు.ఈ కార్యక్రమంలో జయరామి రెడ్డి,వంశీ కృష్ణ, అరుణ్ కుమార్, సుభాని,ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

స్వయం పాలన యాత్ర విజయవంతం చేయండి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల నుంచి ప్రారంభిస్తున్న స్వయంపాలన యాత్రను విజయవంతం చేయాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఆ విద్యాసాగర్ తెలిపారు. పట్టణంలోని వీసీకే పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ నేటి నుంచి స్వయం పాలన యాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రెండు అగ్ర కులాలు ఒకరి తర్వాత ఒకరు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న సందర్భంలో వారి కులాలు మాత్రమే లబ్ధి పొందుతున్నాయన్నారు. బహుజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని విషయాన్ని చాటి చెప్పేందుకు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. బహుజనులను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకుంటున్నారన్నారు. ఈ స్వయం పాలన యాత్ర బాపట్లలో ప్రారంభమై తిరుపతి వరకు అమలాపురం వరకు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు. వీసీకే పార్టీ జిల్లా అధ్యక్షులు రేగులగడ్డ చంద్రశేఖర్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సలగల చంటి బాబు, ఆదినారాయణ ప్రకాశం జిల్లా అధ్యక్షులు,యలమంద జిల్లా కార్యదర్శి వంజా ముత్తయ్య, దాసరి లక్ష్మి, రాష్ట్ర మహిళా విభాగం కూచిపూడి మరియరాణి పాల్గొన్నారు.

లేళ్ల అప్పిరెడ్డికి చల్లా రామయ్య శుభాకాంక్షలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ప్రభుత్వ విప్‌గా నియమితులైన లేళ్ల అప్పిరెడ్డిని వైయస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య సహకారంతో వైసీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్య గురువారం కలిసి లేళ్ల అప్పిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చల్లా రామయ్య 100 మంది దివ్యాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మత్స్యకారుల అభివృద్ధికి వీర రాఘవులు కృషి

విశాలాంధ్ర - బాపట్ల : మత్స్యకారుల అభివృద్ధికి వర్రమాని వీరరాఘవులు విశేష కృషి చేశారని మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్ రెడ్డి కొనియాడారు. బాపట్ల మండలం ఆదర్శ్ నగర్‌కు చెందిన వీరరాఘవులు బుధవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న గోవర్ధన్ రెడ్డి గురువారం ఉదయం ఆదర్శనగర్ లోని వీర రాఘవులు మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ శాసనసభ్యులుగా ఉన్న సమయంలో ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా వీర రాఘవులు విశేష సేవలందించారన్నారు. మత్స్యకారులకు అవసరమైన బోట్లు, వలలు, తెప్పలు, ఇతర సామాగ్రిని సబ్సిడీపై అందించారన్నారు. మత్స్యకారులకు గృహ నిర్మాణం, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, రహదారి నిర్మాణానికి కృషి చేశారన్నారు. తీర ప్రాంతంలో చేపల ఎండబెట్టుకునేందుకు అవసరమైన స్థలాన్ని వీరరాఘవులు సమయంలోనే ఏర్పాటు చేయటం జరిగిందని గోవర్ధన్ రెడ్డి అన్నారు. వీర రాఘవులు లేని లోటు ఆదర్శనగర్‌లో తీర్చలేనిదన్నారు.

మద్యం సేవించటమే నేరాలకు మూలకారణం

విశాలాంధ్ర - బాపట్ల : సమాజంలో జరుగుతున్న అనేక నేరాలకు మూలకారణం మద్యం సేవించటమే అని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే 357 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొంతమంది చెడు నడత కలిగిన వారు జిల్లాలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, తీవ్ర నేరాలకు పాల్పడుతున్నారన్నారు. మహిళలకు, పాదచారులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నారన్నారు. మద్యం మత్తులో చిన్నచిన్న విషయాలకు కూడా గొడవలు పడి తీవ్ర నేరాలకు దారితీస్తున్నాయన్నారు. జిల్లాలో నేరాలు నియంత్రణకు పోలీస్ శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలు కూడా తమ వంతు సహాయ సహకారాలను అందిస్తే నేరాలను నియంత్రించవచ్చునన్నారు. జిల్లాలో ఎవరైనా బహిరంగంగా మద్యం సేవిస్తూ ఉన్నట్లయితే సమాచారాన్ని వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా ఎస్పీ బాపట్ల హెల్ప్ లైన్ నెంబర్ 8333813228 కు, డోల్ ఫ్రీ నంబర్ 112, 100 లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు: ఎంపీ

విశాలాంధ్ర - బల్లికురవ : రాష్ట్రంలోని నిరుపేదలందరికీ నాణ్యమైన విద్య,సొంత ఇల్లు, మెరుగైన వైద్యం అందించాలని సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎంపీ నందిగం సురేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.వైద్య శిబిరం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని,ప్రజల వద్దకే పరిపాలన వ్యవస్థ తీసుకువచ్చి పేదలకు రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యం అందించడానికి ముఖ్యమంత్రి విశేషంగా కృషి చేస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా మారుమూల గ్రామాల్లోని ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. శాప్ నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఆరోగ్యకరమైన సమసమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ కృష్ణ,బాపట్ల పార్లమెంట్ యూత్ అధ్యక్షులు కల్లి అంజనేయ ప్రసాద్ రెడ్డి,గ్రామ సర్పంచ్,జేసీఎస్ మండల ఇన్చార్జి టి నరేష్,మండల వైద్య అధికారులు రమిజ అహ్మద్,భారతి,సౌజన్య పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంలో భాగంగా రోటరీ సామాజిక భవనంలో మండలంలోని రామకృష్ణాపురంకి చెందిన కిడ్నీ బాధితుడు పరమటూరి వెంకటేశ్వరరావుకు రోటరీ క్లబ్ సభ్యుల సహకారంతో రూ. 15 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, పి.వి. తులసీ రామ్, పోలుదాసు రామకృష్ణ, డి.వి.సురేష్, జి.వై.ప్రసాద్, గుర్రం రాఘవరావు, ముప్పాల వెంకట రమణారావు, యం.వి.రామారావు, కిరణ్ కుమార్, శంకరరెడ్డి, లక్ష్మీ ప్రకాష్, బాల వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సురేష్, యజ్ఞ నారాయణ, రోటరీ క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా దళిత జర్నలిస్ట్ అసోసియేషన్

విశాలాంధ్ర - కర్లపాలెం : బాపట్ల దళిత జర్నలిస్ట్ అసోసియేషన్ పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అధ్యక్షులు అశోక్, కార్యదర్శి జంగం దాస్ తెలిపారు. మండలంలోని బిదరు దిబ్బ ప్రాంతానికి చెందిన వృద్దురాలు కత్తి మార్తమ్మ ఇంటి పైకప్పు విరిగి మీద పడటంతో గాయపడి గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో క్షతగాత్రురాలైన ఆ వృద్ధురాలికి దళిత జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య ఖర్చుల నిమిత్తం ఆమె కుటుంబీకులకు రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్ట్ ట్రెజరర్ కత్తి రాజు, కార్యవర్గ సభ్యులు కాగిత స్టాలిన్ కర్లపాలెం మండల అంబేద్కర్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు మండపాటి పరమానంద కుమార్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాపట్లలో గన్‌తో వ్యక్తిపై దాడి

విశాలాంధ్ర - బాపట్ల : బంగారు నగలు తయారు చేసేందుకు ఆర్డర్ తీసుకుని తిరిగి నగలు ఇవ్వకుండా వచ్చిన గుంటూరు వ్యక్తిపై ఇరువురు యువకులు బైకుపై వచ్చి గన్ చూపించి దాడి చేసిన సంఘటన పట్టణంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు గుంటూరు బ్రాడీపేటకు చెందిన ప్రకాష్, పట్టణంలోని బంగారు షాపుల్లో నగలు వారు కొరినట్లు తయారు చేసి ఇచ్చేందుకు ఆర్డర్ తీసుకునేందుకు ఎప్పటిలాగే రాగా బాపట్ల జమ్ములపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద సర్కిల్‌లో ఉన్న ప్రకాష్‌ను బైకుపై వచ్చిన ఇద్దరు యువకులు చేతిలో ఫోన్ లాగేందుకు ప్రయత్నించగా ప్రకాష్ అడ్డుకున్నాడు. దీంతో వారి వద్ద ఉన్న గన్‌ను తీసుకుని చేతిపై బలంగా కొట్టడంతో ప్రకాష్ చేతికి గాయమైంది. అనంతరం అక్కడ నుంచి ఇరువురు యువకులు పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. పట్టణ సిఐ వద్దకు జరిగిన ఈ ఘటనపై విచారణ చేపడుతున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్రజా సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - బల్లికురవ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, సంక్షేమ పథకాల సృష్టికర్తగా ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి కీర్తించబడుతున్నారని శాప్ నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు.గురువారం మండల పరిధిలోని వైదన గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.గ్రామ అభివృద్ధి కమిటీ నాయకుడు మేడ శివదుర్గ ఆధ్వర్యంలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని చైతన్యకు ఘన స్వాగతం పలికారు.చైతన్య ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చిన ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు.కోటి కుటుంబాలకు పైగా పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందించిన ఘనపాటిగా జగన్మోహన్ రెడ్డి పేరొందారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి మహిళా పక్షపాతిగా నిలిచి అన్ని రంగాలలో మహిళలకు అవకాశాలు కల్పించడంతోపాటు మహిళల రక్షణ కై ప్రత్యేక ప్రణాళిక రూపొందించిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు.రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాల్లో సైతం అమలు చేస్తున్నారని జగన్మోహన్ రెడ్డి పరిపాలనకు నిదర్శనమన్నారు.రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రైతు అధ్యక్షులు చింతల పేరయ్య,గ్రామ సర్పంచి మేడ జయలక్ష్మి,ఎంపీటీసీ నక్క పార్వతి,మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ శ్రీసువలీ,టి నరేష్,మండల యువజన నాయకులు ధూళిపాళ్ల బుల్లి రామయ్య,పసల అంజి నాగేశ్వరరావు,బండారు వెంకయ్య,ముసల గురవయ్య,జూపల్లి రాఘవరావు,సచివాలయ సిబ్బంది,గ్రామ వాలంటీర్లు,ఆయా శాఖల అధికారులు,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

కక్ష పూరిత పాలన వ్యతిరేకించండి

విశాలాంధ్ర - చీరాల : రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న కక్ష పూరిత పాలనను ప్రజలందరు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని, అధికారంతో ప్రజలకు మేలు చేయాల్సింది పోయి మానవ హక్కులు ఉల్లంఘించి అక్రమ కేసులు పెడుతున్నారని టీడీపీ ఇంచార్జి మద్దులూరి మాలకొండయ్య అన్నారు. గురువారం నేను సైతం బాబు కోసం నిరాహార దీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాలకొండయ్య మాట్లాడుతూ రాజకీయాలలో అవకాశం వస్తే ప్రజలకు మేలు చేయాలి కానీ ప్రశ్నించే వారు లేకుండా బెదిరింపు రాజకీయాలు సరికాదన్నారు.మనిషికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కల్పిస్తూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఎటువంటి ఆధారాలు లేకుండా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. నేరం జరిగింటే ముందస్తు నోటీసులు ఇచ్చి ఆధారాలు చూపించాలని కనీస నిబంధనలు పాటించకుండా అక్రమంగా అరెస్ట్ చేశారని ఇవన్నీ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గవ్వల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కొండ్రు రత్నబాబు, పులిపాటి శేఖర్,గుంటి మల్లికార్జునరావు, గోలి శ్రీనివాసరావు,శీరందాసు కాశిదాసు,తోట సాంబశివరావు,పఠాన్ అయూబ్ ఖాన్,రాసాల శ్రీనివాస్,బండి శ్రీనివాసరావు, సిరిపురం రాజమ్మ,కళ్యాణం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు లేకుండా పేదలకు నాణ్యమైన వైద్యం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : జగనన్న సురక్ష ద్వారా పేద లకు నాణ్యమైన వైద్యాన్ని ప్రభుత్వం అందిస్తున్నదని స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి అన్నారు. మండల పరిధిలోని పరియమ్మపేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కరణం బలరామ కృష్ణమూర్తి, వైకాపా ఇంఛార్జి కరణం వెంకటేష్ పాల్గొన్నారు. వివిధ విభాగాలను, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ పెద్ద జబ్బులు గుర్తిస్తే వారిని పెద్ద ఆసుపత్రులకు తరలించి ఖర్చు లేకుండా ఉచిత వైద్యాన్ని ప్రభుత్వమే అందిస్తుందన్నారు. కరణం వెంకటేష్ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, కొండ్రు బాబ్జీ, కౌన్సిలర్లు, వైకాపా నాయకులు, సచివాలయ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు శంకరన్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - బాపట్ల : పాలనా వ్యవస్థను ప్రజల వద్దకు తీసుకెళ్లి పెట్టించిన ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ విగ్రహాన్ని కలెక్టరేట్ ప్రాంగణంలో నెలకొల్పనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శంకరన్ 13వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆవిష్కరిస్తామని ఆయన వివరించారు. ఏపి మానవ వనరుల అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్.డి చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు.దీనికి సంబంధించిన కరపత్రాలను గురువారం కలెక్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు,సెక్ కార్యదర్శి సిహెచ్ పార్థసారథి పాల్గొన్నారు. దళిత ,గిరిజన ,అట్టడుగు వర్గాల సముద్ధరణకు ఆయన విశేషంగా పాటుపడ్డారని జెసి అన్నారు. వెట్టి చాకిరీ విధానం, సఫాయి కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు.

పిహెచ్ఎస్- సుప్రీత్-36 విత్తనాలతో అధిక దిగుబడులు

విశాలాంధ్ర - పిట్టలవాని పాలెం : గత కొంత కాలంగా కూరగాయల ధరలు తక్కువగా ఉండటంతో రైతులకు లాభసాటి లేక ఇబ్బందులు పడుతున్న కాలంలో ప్రభాకర్ హైబ్రిడ్ సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ వారి సుప్రీత్-36 అను బెండ రకం విత్తనాలు అధిక పంట దిగుబడులు ఇస్తున్నదని కర్లపాలెం మండలం తుమ్మలపెంట్రపాలెం గ్రామానికి చెందిన ఎర్రా శివారెడ్డి అనే రైతు తెలిపారు. సుప్రీత్-36 అను బెండ రకం విత్తనాలు 30 సెంట్లలో వేసి రోజుకు 1.5 క్వింటాలు పంట దిగుబడి పొందుతున్నానని గురువారం కంపెనీ వారు నిర్వహించిన క్షేత్రస్థాయి ప్రదర్శనలో చెప్పారు. రైతులు అందరూ సుప్రీత్-36 అను బెండ రకం విత్తనాలు వేసి అధిక పంట దిగుబడులు సాధించాలని రైతులను కోరారు.రైతులకు సుప్రీత్-36 అను బెండ రకం విత్తనాలు అందించడానికి తమ కంపెనీ వారు ఎప్పుడు అందుబాటులో ఉంటారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంపెనీ యొక్క ఆర్ ఎమ్-ఎమ్.ద్వారకానాథ్ కోరారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఎస్ఓ పి.రామకృష్ణ, డిస్ట్రిబ్యూటర్ జయచంద్ర సీడ్స్ పి.నాగేశ్వరరావు కలిసి ఎర్రా శివారెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో 150 రైతులు పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-అద్దంకి ; అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను గురువారం స్థానిక మారుదాల సేవాసదన్ నందు రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు.పుట్టంరాజు బుచ్చయ్య,రామలక్ష్మమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ పక్షాన ముగ్గురు విశ్రాంత ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న పురస్కార గ్రహీత విశ్రాంత ఆర్జెడి దేవపాలన మాట్లాడుతూ ఆరుపదులు దాటిన వారమంతా ఇలా సమావేశం ద్వారా కలుసుకోవడం ఆనందదాయకమని,ఒకరికొకరు కష్టసుఖాలు పంచుకునే అవకాశం కలుగుతుందన్నారు.కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, విశ్రాంత డిగ్రీ కళాశాల లెక్చరర్ నర్రా శ్రీలక్ష్మి, విశ్రాంత ఉద్యోగులు ధర్మవరపు సీతారామయ్య,జ్యోతి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు జగనన్న వైద్య సేవలు

విశాలాంధ్ర - చీరాల : జగనన్న సురక్ష ద్వారా పేదల వద్దకు ఆరోగ్య సేవలు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. గురువారం చీరాల 32వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలనతో పాటు ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేసిన జగన్మోహన్ రెడ్డి పెద్ద పీట వేశారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సురక్ష వైద్య శిబిరాలకు ప్రజలలో మంచి స్పందన వచ్చిందన్నారు. గ్రామాల్లో ప్రజలకు వైద్యం అందించేందుకు వైద్యాధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి,వైద్య పరీక్షలు నిర్వహించి,అవసరమైన వారికి అవసరమైన మందులు కూడా పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.